క్లుప్తంగా

అంగన్వాడీ పోషణవాటికల పరిశీలన



వెంగళరాయపురం అంగన్వాడీ కేంద్రంలో పోషణవాటికను పరిశీలిస్తున్న పీడీ సులేఖ

బలిజిపేట: అంగన్వాడీ కేంద్రాల వద్ద పోషణవాటికలను తయారుచేసి వాటిద్వారా లభించే ఆకుకూరలు, కాయగూరలను చిన్నారులకు మంచి పోషకాహారంగా అందించడమే లక్ష్యమని బలిజిపేట సీడీపీఓ సులేఖ తెలిపారు. ఈ మేరకు వెంగళరాయపురంలో పోషణవాటికను ఆమె మంగళవారం పరిశీలించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం వద్ద వాటిని ఏర్పాటుచేసి రసాయన ఎరువులు లేకుండా పండించిన ఆకుకూరలు, కాయగూరలతో చిన్నారులకు పోషకాహారాన్ని అందించడమే లక్ష్యమన్నారు. అందువల్ల కేంద్రం పరిధిలో ఉండే చిన్న స్థలంలో అయినా పెంచాలని సూచించామన్నారు. అదేవిధంగా మండలంలో కొన్ని అంగన్వాడీ కేంద్రాలను హబ్ కేంద్రాలుగా గుర్తించినట్లు చెప్పారు. వాటిని సంపూర్ణంగా ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈసీ మాత్రలు అందరితో మింగించాలి



నారన్నాయుడువలసలో సూచనలు ఇస్తున్న అధికారి సూర్యనారాయణ

బలిజిపేట: డీఈసీ మాత్రలు అందరికీ పంపిణీ చేసి వారితో మింగించే గురుతర బాధ్యత అంగన్వాడీలు, ఆశలదేనని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన గంగాడ, నారన్నాయుడువలసలలో ఫైలేరియా మాత్రల సామూహిక పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించారు. గంగాడలో అంగన్వాడీలు నిర్వహిస్తున్న బూత్ ఏక్టివిటీని అడిగి తెలుసుకున్నారు. నారన్నాయుడువలసలో పిల్లలకు మాత్రలు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అంగన్వాడీలు, ఆశలకు వివరించారు. మరణభయం లేనందున బోదకాలు వ్యాధిపై నిర్లక్ష్యం ఉంటుందని వ్యాధి సంక్రమించిన తరువాత వచ్చే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఒక్కరిచేత మాత్రలు మింగించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా 'రీ'సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జేసీ శోభిక

సీతానగరం: మండలంలో పైలెట్ గ్రామంగా గుర్తించిన లచ్చయ్యపేటలో జరుగుతున్న రీసర్వే పనులను రైతుల సహకారంతో నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జయింట్ కలెక్టర్ శోభిక అన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ తన పర్యటనలో భాగంగా మంగళవారం పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా గుర్తించిన లచ్చయ్యపేటలో జరుగుతున్న 'రీ' సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లచ్చయ్యపేట రైతుల సహకారం తీసుకుని సమగ్రంగా రీ సర్వే పనులు పూర్తి చేయాలని అందుకు సర్వే అండ్ సెటిల్మెంట్, రెవెన్యూ, జిరాయితీ భూములను గుర్తించనున్నామన్నారు. లచ్చయ్యపేట రెవెన్యూలో 886.04 ఎకరాల జిరాయితీ భూములున్నాయని తెలియ జేశారు. ఆయాభూములను నాలుగువిభాగాలు చేశామన్నారు. ఇప్పటికి 1/4వ వంతు 111.61 ఎకరాల్లో భూసర్వే జరిగిందన్నారు. మిగతాభూమిలో నిర్దేశించిన గడువులోగా రీసర్వే పనులు పూర్తి చేయాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్, డీటీ ఉమామహేశ్వరరావులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్ శ్రీనివాసరావు, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పెదపథంలో ఘనంగా వల్లమ్మ తల్లి జాతర



పెదపథంలో నిర్వహిస్తున్న వల్లమ్మ తల్లి జాతర సిరిమాను

సాలూరు: మండలంలోని పెదపథంలో వల్లమ్మ తల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వీధుల్లో రథం మాను వెంట భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.సుమారు 21 గ్రామాల భక్తులు తరలివచ్చే ఈ జాతరలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా రూరల్ ఎస్సై నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

అదే జనం..అదే శోభ..



శంబర పోలమాంబ అమ్మవారు

- భక్తులతో కిటకిటలాడిన క్యూలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబరపోలమాంబ అమ్మవారి మూడవ జాతరకు భక్తులు పోటెత్తారు. తొలిజాతరను తలపించేలా, మూడవ జాతరకూ భక్తులు తరలివచ్చారు. మంగళవారం తెల్లవారుజామునుంచి ఆటోలు, ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలపై అత్యధికంగా సుదూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లపై భక్తులు, శంబర గ్రామానికి చేరుకున్నారు. మారుజాతర నాడు రథసప్తమి పండగ సందర్భంగా భక్తుల రద్దీతగ్గినందున, మూడవ జాతరకు భక్తులు రద్దీ ఎక్కువగా ఉంటుందని అధికారులు ముందుగా ఊహించనట్లే జరిగింది. ఉదయం 9గంటల తరువాత ఒక్కసారిగా భక్తులు శంబర గ్రామానికి చేరుకోవడంతో దారులన్నీ రద్దీగా మారాయి. భక్తుల రద్దీ పెరగడంతో ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకటరమణ, ఉత్సవకమిటీ సభ్యులు దగ్గరుండి పోలమాంబ అమ్మవారి దర్శనానికి భక్తులను పంపించారు.



క్యూలు నిండిపోవడంతో ఆరుబయట ఉన్న భక్తులు



గోముఖి నది ఒడ్డున మొక్కులు చెల్లిస్తున్న భక్తులు





వంటకాలు చేసుకుంటున్న భక్తులు

మొక్కులు చెల్లించిన భక్తులు

చదురుగుడి, వనంగుడిలో కొలువైన శంబరపోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. గోముఖి నది ఒడ్డున భక్తులు తలనీలాలు సమర్పించి నదిలో స్నానాలు ఆచరించారు. కోళ్లు, మేకలు, చీరలు మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఘటాలను చెల్లించారు. వనంగుడి వెనుక ఉన్న వేపచెట్టుకు పూజలు నిర్వహించారు. అలాగే ప్రధానవీదిలోని సిరిమాను కర్రకు భక్తులు పసుపు, కుంకమలతో పూజలు చేశారు. చదురుగుడి క్యూ వద్ద ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులు వనంగుడిలో అమ్మవారిని దర్శించుకుని, అక్కడే వంటకాలు చేసి భోజనాలు ఆరగించారు.



సాంస్కృతిక కార్యక్రమం



గోముఖి నది బ్రిడ్జి వరకు బారులు తీరిన భక్తులు



తలనీలాలు సమర్పించుకుంటున్న చిన్నారి

రైతులు ఈ పోర్టల్‌లో విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు సాగు చేస్తున్న పంటలను ఈ పోర్టల్‌లో విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా జానుమల్లు వలస, గాదెలవలస గ్రామాల్లో మంగళవారం రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతుల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులు ప్రతి ఒక్కరూ రైతులు వారి పాస్ పుస్తకాలు అనుసంధానం జరిగిన ఆధార్, మొబైల్ నంబర్ తీసుకుని ఆర్ఎస్‌కే సిబ్బంది వద్దకు వెళ్లి ఓటీపీ సహాయంతో లేదా నేరుగా బయోమెట్రిక్ విధానం ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరు లోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది కావున తప్పనిసరిగా నమోదు చేసుకుంటే రైతులకు రాబోయే పీఎం కిసాన్ నగదు జమవుతుందని, అలాగే రాబోయే అన్ని వ్యవసాయ స్కీమ్‌లకు ఈ పంట నమోదు కార్యక్రమాలకు ఈ రిజిస్ట్రీ ఇకపై ఒక ప్లాట్ ఫారంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు సత్వర చర్యలు



గర్భిణులను తనిఖీ చేస్తున్న డాక్టర్ పి.ఉష

సీతానగరం: గర్భిణులు ఎదుర్కొనే రక్తహీనత నివారణకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సత్వర చర్యలు తీసుకుంటున్నామని పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉష అన్నారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వివిధ గ్రామాలనుంచి వచ్చిన 52 మంది గర్భిణులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ గర్భిణుల సుఖమయ ప్రసవానికి అవసరమైన వైద్య సేవలు క్షేత్రస్థాయిలోనే అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని. నెలకోపర్యాయం గర్భిణుల్లో ఐరన్, ఇతర పోషకవిలువల శాతాన్ని గుర్తించడానికి స్థానిక ల్యాబ్‌లో టెక్నీషియన్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు విధిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం హెల్త్‌సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఏఎన్ఎంలు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఐరన్ లోపాన్ని నివారించడానికి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే గర్భిణులు సుఖప్రసవానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాలని కోరుతున్నామని. అందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఏఎన్ఎంలు, ఎల్‌హెచ్‌వీలు ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రీలో నమోదులు



రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్, సిబ్బంది

బలిజిపేట: రైతు రిజిస్ట్రీలో ప్రతి రైతు తప్పనిసరిగా నమోదుకావాలని ఏఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మండలంలోని సుభద్ర, అరసాడ గ్రామాల్లో రైతు రిజిస్ట్రీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దేశంలోని రైతులందరి సమాఖ్య రిజిస్ట్రీ అని ఏఓ తెలిపారు. సాధారణ ప్రమాణాల ప్రకారం రాష్ట్రాలతో సంకలనం చేశారన్నారు. ప్రతి రైతుకు ఒక ప్రత్యేక ఐడీ కేటాయించనున్నట్లు తెలిపారు. దీనిలో రైతుల సమగ్ర సమాచారాన్ని భద్రపరిచే డిజిటల్ డేటాబేస్ అని చెప్పారు. భూ యాజమాన్య రికార్డులు, పంట వివరాలు, ఇతర సంబంధిత వ్యవసాయ సమాచారాన్ని ఈ రిజిస్ట్రీ క్రమబద్ధీకరించడానికి రూపొందించిందన్నారు. పథకాలు, రైతులకు వివిధ సేవలు, సమాచారం అందుబాటులో ఉండే విధంగా ఏకీకృత వేదికను తయారుచేయనున్నట్లు స్పష్టం చేశారు. డిజిటల్ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు రిజిస్ట్రీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వర్తక కలాసీ సంఘం సమ్మెవిరమణ

పార్వతీపురంటౌన్: వర్తక కలాసీ సంఘం-పట్టణ వర్తక సంఘాల మధ్య చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమణ చేపడుతున్నట్లు వర్తక కలాసీ సంఘం అధ్యక్షుడు గేదెల సర్వేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన కూలిరేట్ల ఒప్పందం కోసం వర్తక కలాసీ సంఘం ఆధ్వర్యంలో జనవరి 29 అర్ధరాత్రి నుంచి సమ్మె చేపట్టామన్నారు. గతంలో చేసుకున్న ఒప్పంద కాలపరిమితి ఈ సంవత్సరం జనవరి 29వ తేదీతో ముగిసిందన్నారు. ఒప్పంద కాలపరిమితి పూర్తవుతున్న సందర్భంలో ముందుగానే నూతన ఒప్పందం కోసం వర్తక సంఘాలకు నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో సమ్మె చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎట్టకేలకు ఈనెల 10న చర్చలు జరిగి ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. కూలిరేట్లపై గతం కంటే 25 శాతం పెంచి, జీవిత బీమాకు ప్రతి కలాసీకి యాజమాన్య వాటా కట్టడానికి, పని స్థలం వద్ద ప్రమాదం జరిగిన సందర్భంలో ప్రాథమిక చికిత్స చేయడానికి పట్టణ వర్తక సంఘాలు అంగీకరించాయన్నారు.

ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఆప్కాస్ కార్మికులు

పార్వతీపురంటౌన్: ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఈ-ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఆప్కాస్)ను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు సేవల కార్మికుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దు చేయాలని మంత్రివర్గం తీర్మానించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. దీంతో ఆప్కాస్‌లో ఉన్న పొరుగు సేవల కార్మికులందరిలోనూ తీవ్ర భయాందోళన నెలకొందన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే తిరిగి దళారీ వ్యవస్థ రంగంలోకి వస్తుందని, ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందన్న భయాందోళన కలుగుతోందన్నారు. ఉద్యోగ భద్రత, భరోసా కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆప్కాస్ ఏర్పాటు కాకముందు మున్సిపాలిటీ రంగంలో ప్రతి సెక్షన్‌లో దళారీ వ్యవస్థ కొనసాగేదని, జీతభత్యాల చెల్లింపు దళారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదని,కూటమి ప్రభుత్వం ఆప్కాస్ ను రద్దుచేసి ఒప్పంద కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తుందని కార్మికులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, శాశ్వత స్వభావం కలిగిన విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఒప్పంద కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేసే దిశగా కాకుండా దళారీ వ్యవస్థను తెచ్చిపెట్టేటట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింహాచలం, శంకర్రావు, శివ, రాజేష్, సంతు, నరేష్, గంగయ్య పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో పదవతరగతి చదివే విద్యార్థులందరూ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఐటీడీఏ సమావేశ మందిరంలో సహాయ గిరిజన సంక్షేమ అధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రధానాచార్యులు, వసతిగృహ సంక్షేమ అధికారులతో పదవతరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు."పదవతరగతి పబ్లిక్‌లలో అందరు విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా సంబంధిత ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో శతశాతం ఉత్తీర్ణతతో పాటు విద్యార్థులు ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని సూచించారు.

ఏజెన్సీ బంద్‌కు మద్దతుగా ఆర్‌సీఎస్ ర్యాలీ



మక్కువలో ర్యాలీ చేస్తున్న రైతుకూలీసంఘం నాయకులు

మక్కువ: గిరిజనసంఘాలు ఏజెన్సీ బంద్‌కు పిలుపు నివ్వడంతో, ఆ సంఘాలకు మద్దతుగా రైతుకూలీసంఘం మంగళవారం మక్కువలో ర్యాలీ, మానవహారం నిర్వహించింది. రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు నాయకత్వంలో మండలంలోని అన్ని గిరిజన గ్రామాలనుంచి ఆర్‌సీఎస్ నాయకులు, గిరిజనులు ర్యాలీ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక సువర్ణముఖి బ్రిడ్జి నుంచి, మక్కువ ప్రధానరహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగురోడ్ల కూడలివద్ద మానవహారంగా రూపొందారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్యాలు మాట్లాడుతూ గిరిజనులను కాపాడాల్సిన ప్రభుత్వాలే, గిరిజన హక్కులు కాలరాసేందుకు చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇప్పటికే అనేక ప్రాంతాలలో గిరిజనుల భూములను గిరిజనేతరుల ఆధీనంలోకి వెళ్లిపోయాయన్నారు. దీంతో గిరిజనులు సెంటుభూమిలేని నిరుపేదలుగా జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1/70 చట్టం, పీసా చట్టాలను సమర్థవంతంగా అమలుచేయాలని కోరారు. నాన్‌షెడ్యూల్డ్ గ్రామాలన్నింటిని, షెడ్యూల్డ్ గ్రామాలలో విలీనం చేయాలని, జీవో నంబర్ 3ను పునరిద్ధరించాలని కోరారు. విద్యుత్‌సౌకర్యం, తాగునీటి సదుపాయం లేని గ్రామాలను గుర్తించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుకూలీసంఘం ఉపాధ్యక్షుడు పీడిక అసిరి, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకుడు మర్రి చెంచు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో బైక్ ర్యాలీ

- ఏజెన్సీ బంద్‌కు మద్దతుగా కార్యక్రమం



పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

పార్వతీపురంటౌన్: గిరిజనుల జీవనాధారమైన 1/70చట్టం జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని గిరిజన, ఆదివాసీ, రైతు కూలీ సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం జరగనున్న ఏజెన్సీ బంద్‌లో భాగంగా మంగళవారం పార్వతీపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఒకవైపు జీఓ 3 లేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరమవుతున్న నేపథ్యంలో, మరో వైపు షెడ్యూల్డ్ గ్రామాల గుర్తింపు లేక అనేక, సరైన జీవన స్థితిగతులు కరువై అవస్థలు పడుతున్న గిరిజనులను అడవికి దూరం చేసి, బతుకులు లేకుండా ప్రభుత్వం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు.

బంద్‌కు సహకరించాలి

అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే చర్యలను చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. 1/70 చట్టం రద్దు, సవరణ వంటి ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం జరుగుతున్న సంపూర్ణ బంద్‌కు ప్రజలు, వాణిజ్య, వర్తక, వ్యాపారాలు అందరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పార్వతీపురం సుందరయ్య భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్, రాయగడ రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పాలక రంజిత్ కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు కద్రక రామస్వామి, ఆదివాసీ హక్కుల వేదిక నాయకురాలు జయలక్ష్మి, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) నాయకుడు ఎం.భాస్కరరావు (బాషా), అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు బొత్స నర్సింగరావు, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిర, ప్రగతి శీల మహిళా సంఘం నాయకురాలు పోలా రమణి, రైతు సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి, సీపీఐ నాయకులు తోట జీవా, సీఐటీయూ నాయకులు యమ్మల మన్మథరావు, గొర్లి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు డేవిడ్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు బి.రవికుమార్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు బి.సూరిబాబు, పి సన్యాసిరావు, అఖిలభారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం (అయ్యార్ల) నాయకుడు పి.సంఘం, రైతు కూలీ సంఘం నాయకుడు రాజు, పట్టణ వర్తక కలాసీ సంఘం నాయకులు సర్వేశ్వరరావు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను నిర్లక్ష్యం చేస్తే ఊరుకోం

- ఏపీఓ పనితీరుపై వైస్ఎంపీపీ ఆగ్రహం
- అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం
- రెవెన్యూ అధికారులు గైర్హాజరు
- వాదనతో ముగిసిన సర్వసభ్యసమావేశం

సాలూరు రూరల్: ఎన్నికల కోడ్ కారణంగా మండల సర్వసభ్య సమావేశంలో కేవల అధికారుల సమీక్షలు నిర్వహించారు. సమావేశంలో ఎలాంటి అభివృద్ధి తీర్మానాలు జరగలేదు. ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షతన వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ మండల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.సమావేశం ప్రారంభం నుంచి అధికారులతో డిపార్ట్‌మెంట్ వారీగా సమీక్ష నిర్వహించిన సందర్భంలో మండలంలోని అంగన్వాడీ భవనాలకు ప్రహరీలు మంజూరయ్యాయని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి ప్రస్తావించగా ఎప్పుడు మంజూరయ్యాయి? ఏ నిధులతో మంజూరయ్యాయని వైస్ఎంపీపీ ప్రశ్నించగా ఎన్ఆర్ఈజీఎస్‌లో మంజూరయ్యాయని ఆమె చెప్పారు. దీంతో సర్పంచుల తీర్మానాలు లేకుండా ఎలా మంజూరయ్యాయని వైస్ఎంపీపీ రెడ్డి సురేష్ ప్రశ్నించడంతో అన్నింటి తీర్మానాలు ఉన్నాయని తీర్మానాల కాపీలు వైస్ఎంపీపీకి చూపించారు. అయితే అందులో మామిడిపల్లికి సంబంధించి తీర్మానం కాపీలో సంతకాలు లేకపోవడంతో సభ్యులు ఉపాధిహామీ ఏపీఓ రామకృష్ణను నిలదీశారు. ఇంకో కాపీ ఉందంటూ సభ్యులతో ఏపీఓ వాదోపవాదాలకు దిగడంతో సభ్యులు ఏపీఓ మధ్య వాదనలు జరిగాయి. దీంతో సభ్యులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వడం లేదని ఈ విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సభ్యులు స్పష్టం చేశారు. అసలు పంచాయతీల్లో ఎక్కడ ఏ పనులు మంజూరయ్యాయో సర్పంచ్‌లకు తెలియకుండా వైఎస్సార్‌సీపీ, టీడీపీల మధ్య గొడవలకు ఏపీఓ రామకృష్ణ కారణమవుతున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీఓ పార్వతి కల్పించుకుని వాదనలు ఆపాలని అందరం కలిసి అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. దానికి వైఎస్సార్‌సీపీ సభ్యులు తాము ఎప్పుడు అభివృద్ధికి తోడ్పడుతున్నామని ఏపీఓ కారణంగానే ఇన్ని గొడవలు వస్తున్నాయని వైస్ఎంపీపీ అన్నారు.

కొత్తగా పనులు మంజూరు కాలేదు

ప్రస్తుతం గత ప్రభుత్వంలో మంజూరైన పనులు మాత్రమే జరుగుతున్నాయని కొత్తగా ఈ ప్రభుత్వంలో మంజూరైన పనులు లేవని పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ సభలో వివరించారు. గత ప్రభుత్వంలో 115 పనులు మంజూరు కాగా 40 పనులు ప్రారంభం కాలేదని సభకు వివరించారు. అలాగే కొఠియా గ్రూప్ గ్రామాలలో మంజూరైన 45 పనులు రద్దయ్యాయని తెలిపారు. దీనికి వైఎస్ ఎంపీపీ రెడ్డి సురేష్ మాట్లాడుతూ మీరు రద్దుచేశారా? లేక ఎవరైనా ఒత్తిడితో రద్దుచేయించారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశానికి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని ఈ విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సభ్యులు స్పష్టం చేశారు.



అధికారులు సభ్యుల మధ్య వాదోపవాదాలు

సాధారణ ప్రసవాలు ఆరోగ్యానికి ఎంతో మేలు

- వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహనరావు

బలిజిపేట: పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాలు జరిపేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన ఉందని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు గర్భిణులకు సూచించారు. బలిజిపేట పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రతి గర్భిణికి సాధారణ ప్రసవం జరిగే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నెల ఆరోగ్యతనిఖీలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. గర్భిణులకు రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని రక్తపరీక్షద్వారా తెలుసుకుని అవసరమైన చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పర్యటించి గర్భిణుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచి పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యాధులు సోకకుండా వేడినీరు, ఆహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎపిడమిక్ ఎంపీహెచ్ఈఓ సత్తిబాబు, డీపీహెచ్ఎన్‌డీ విజయలత, డీపీఓ ఉషారాణి, స్థానిక వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేట పీహెచ్‌సీలో గర్భిణులకు సూచనలు అందిస్తున్న అధికారి జగన్‌మోహనరావు